సీఎం రేవంత్‌రెడ్డి నివాసం వద్ద 2008-డీఎస్సీ బాధితుల ఆందోళన

డీఎస్సీ-2008 బాధితులకు పోస్టులిస్తం

15రోజుల్లో ఇస్తామని సీఎంవో హామీ

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : ఈ ఏడాది మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు తమకు ఉద్యోగాలు ఇవ్వాలని 2008-డీఎస్సీ బాధితులు సోమవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి భారీగా తరలివచ్చారు. డీఎస్సీ-2008 సాధన సమితి నేతృత్వంలో 200మందికి పైగా అభ్యర్థులు సీఎం ఇంటికి చేరుకోగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనంతరం ఆరుగురిని సీఎం ఇంట్లోకి అనుమతించారు. సీఎం వ్యక్తిగత కార్యదర్శి జైపాల్‌రెడ్డి వారితో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. తమకు ఉద్యోగాలు ఇవ్వాలని హైకోర్టు ఈ ఏడాది ఫిబ్రవరి 8న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని, దీంతో గత మార్చి14న రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో డీఎస్సీ బాధితులకు ఏపీ తరహాలో ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్టు గుర్తుచేశారు. ఈ నెల 27నాటికి నియామక ప్రక్రియ పూర్తిచేస్తామని, చివరి అవకాశం ఇవ్వాలని అడ్వకేట్ జనరల్ హైకోర్టు ధర్మాసనానికి తెలిపారని, ఈ గడువు నేటితో ముగియనున్నట్టు వివరించారు. అనంతరం సీఎంవో అధికారులు విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో మాట్లాడి వివరాలు సేకరించారు. వారం రోజుల్లో క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక తీసుకొని, 15రోజుల్లో నియామక ప్రక్రియ పూర్తిచేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్టు డీఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సభావత్ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో సమితి ఉపాధక్షుడు భాస్కర్, ప్రతినిధులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌చావ్లా, ప్రమీల, ప్రశాంతి, లావుడ్యా రవి పాల్గొన్నారు.

'ఇన్‌స్పైర్' అవుతారా..?

- ఇన్‌స్పైర్ మానక్‌పై స్కూళ్ల అనాసక్తి
- వచ్చిన ఎంట్రీలు 1,451
- సెప్టెంబర్ 15తో ముగియనున్న గడువు

హైదరాబాద్, ఆగస్టు 26(నమస్తే తెలంగాణ): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని.. సైన్స్ జిజ్ఞాసను పెంపొందించేందుకు విద్యాశాఖ నిర్వహించే ఇన్‌స్పైర్ మానక్ పట్ల రాష్ట్రంలోని పాఠశాలలు ఆసక్తిచూపడంలేదు. నారాయణపేట, ఆదిలాబాద్, ములుగు, యాదాద్రి భువనగిరి, జయశంకర్‌భూపాలపల్లి, నిర్మల్, మెదక్ జిల్లాల నుంచి ఇప్పటివరకు ఒక్క దరఖాస్తూ రాలేదు. రాష్ట్రంలో 12,954 పాఠశాలలున్నాయి. ఈ విద్యాసంవత్సరానికి 64,770 నామినేషన్లను లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 1,451 మాత్రమే వచ్చాయి. 2024-25 విద్యాసంవత్సరానికి ఇన్‌స్పైర్ దరఖాస్తుల స్వీకరణ గడువు సెప్టెంబర్ 15తో ముగియనుంది. ఈ నేపథ్యంలో పాఠశాలలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీఈఆర్టీ అధికారులు కోరారు. ఇప్పటి వరకు మహబూబాబాద్ నుంచి 395, నల్లగొండ నుంచి 173, నాగర్‌కర్నూల్ నుంచి 118 మాత్రమే ఎంట్రీలు వచ్చాయి. మిగిలిన 30 జిల్లాల్లో ఒక్కో జిల్లా నుంచి వంద ఎంట్రీలు కూడా రాలేదు. జనగాం 5, పెద్దపల్లి 6, కామారెడ్డి 8, జోగులాంబ గద్వాల నుంచి 10 చొప్పున మాత్రమే దరఖాస్తులొచ్చాయి.

స్టార్టప్‌లుగా అవతరించే చాన్స్..

విద్యార్థి దశలోనే పరిశోధనాకాంక్షను పెంపొందించేందుకు ఇన్‌స్పైర్‌ను విద్యాశాఖ అమలుచేస్తున్నది. మాడ్యూల్స్‌ను రూపొందించడం వరకే పరిమితం కాకుండా.. ప్రాజెక్ట్‌లకు వాస్తవిక రూపాన్నిచ్చి స్టార్టప్‌లుగా రూపొందించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. విద్యార్థుల ఆలోచనలకు పదునుపెట్టేందుకు ఐఐటీ, ఎన్ఐటీ, ఐసర్ సంస్థల సహకారం తీసుకుంటున్నారు. ఇన్‌స్పైర్ జిల్లాస్థాయిలో ఎంపికైతే రూ.10వేలు, జాతీయస్థాయికి ఎంపికైతే రూ.20వేల చొప్పున ప్రోత్సాహకాన్ని విద్యాశాఖ అందిస్తున్నది.

సీఎంఆర్ఎఫ్‌పై సీ'ఐ'డీ

- నకిలీ బిల్లులతో ప్రైవేట్ దవాఖానల భారీ స్కామ్
- 28 ప్రైవేట్ దవాఖానలపై చర్యలకు సీఐడీ సిద్ధం
- ఫోర్జరీ, చీటింగ్‌లపై 6 ఎఫ్ఐఆర్‌లు, 17 కేసులు
- చైన్‌లింక్ స్కామ్‌లో ప్రభుత్వ వైద్యులు, ఆధికారులు?

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): నకిలీ పేషెంట్లు, నకిలీ బిల్లులతో కొన్ని దవాఖానలు భారీ స్కామ్ నడిపినట్టు సీఐడీ అధికారులు గుర్తించారు. వీరు అక్రమార్గంలో చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) నుంచి భారీగా నిధులు కొల్లగొట్టినట్టు ఆరోపణలున్నాయి. లేని రోగులను, రోగాలను సృష్టించి ఎలాంటి ఆపరేషన్ ఎక్విప్‌మెంట్ లేకపోయినా, ఆపరేషన్లు చేసినట్టు నకిలీ బిల్లులు చూపించి ఆయా దవాఖానల యాజమాన్యాలు రూ.కోట్లు దండుకున్నాయి. ఈ భారీ కుంభకోణంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పది, ఖమ్మం జిల్లాలో పది, నల్లగొండలో మూడు, ఉమ్మడి వరంగల్‌లో మూడు, కరీంనగర్‌లో రెండు ప్రైవేట్ దవాఖానలు ఉన్నట్టు సమాచారం. ఏడాదిన్నర క్రితమే ఈ తరహా కుంభకోణం మంచిర్యాల, హైదరాబాద్‌లో వెలుగు చూడటంతో నాటి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలోనే సుమారు 28 ప్రైవేట్ దవాఖానలు కాసులకు కక్కుర్తిపడి ప్రభుత్వ సొమ్మును కాజేసినట్టు సీఐడీ అధికారులు గుర్తించారు. సీఎంఆర్ఎఫ్ సెక్షన్ ఆఫీసర్ డాక్టర్ డీఎన్ మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతకాల ఫోర్జరీ, చీటింగ్ వంటి అంశాలపై తెలంగాణ సీఐడీ అధికారులు ఆరు ఎఫ్ఐఆర్‌లు, 17 కేసులు నమోదు చేశారు. సీఎంఆర్ఎఫ్‌లోని వ్యక్తులు, ప్రైవేట్ దవాఖానల యాజమాన్యం, కొందరు ప్రభుత్వ డాక్టర్లు, సిబ్బంది, అకౌంటెంట్ ఆఫీసర్లు అంతా చైన్‌లింక్‌గా ఏర్పడి ఈ భారీ మోసానికి తెరలేపినట్టు సీఐడీ గుర్తించింది. దీనిపై లోతుగా విచారణ కొనసాగుతున్నదని, ఈ కుంభకోణం కోట్ల రూపాయల్లో ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్‌కు ముందు ఈ దందా జరిగినట్టు సమాచారం.

లేఖలపై ప్రభుత్వ డాక్టర్ల సంతకాలు

ఈ ప్రైవేట్ దవాఖానలకు రెఫరెన్స్‌గా వస్తున్న ప్రభుత్వ డాక్టర్ల సంతకాలు సైతం బిల్లులపై ఉండటం అనుమానాలకు తావిస్తున్నది. నల్లగొండలోని మూడు దవాఖానల్లో రూ.50 కోట్లకు మేర నకిలీ బిల్లులతో డబ్బులు పొందినట్టు సమాచారం. ఫలానా శస్త్రచికిత్సకు ఫలానా రోగి తమ హాస్పిటల్‌లో జాయిన్ అయినట్టు నకిలీ లేఖలు ప్రభుత్వానికి పంపడం, డబ్బులు క్లెయిమ్ చేసుకోవడం వీరికి పరిపాటిగా మారింది. ప్రైవేట్ దవాఖానల్లో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బంది, ప్రభుత్వ అధికారులు ఓ చైన్‌లింక్‌గా ఏర్పడి.. డబ్బులు దండుకునేలా పథకం రచించినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రైవేట్ దవాఖానల దృశ్చర్య వల్ల ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లింది. గతంలో ఇట్లాంటి కేసు ఒకటి హైదరాబాద్ సీసీఎస్‌లో నమోదైంది. దీనిపై నాటి ప్రభుత్వం వెంటనే విచారణకు ఆదేశించింది. హైదరాబాద్‌లో మొదట నాలుగు దవాఖానలను గుర్తించి చర్యలు తీసుకున్నారు. అయితే ఈ భారీ కుంభకోణం వెనుక అధికారులు, కొందరు నాయకుల పాత్రపై ఆరా తీస్తున్నారు.

త్వరలోనే అరెస్టులు..?

ఈ నకిలీ బిల్లుల్లో పేర్కొన్న రోగుల్లో ఏ ఒక్కరు కూడా వైద్యం చేయించుకోలేదు. అయితే వీరంతా వైద్యం చేసుకున్నట్టు, వాటికి బిల్లులు అయినట్టు రికార్డులు ఉన్నాయి. విచారణలో అవన్నీ నకిలీ బిల్లులుగా సీఐడీ అధికారులు తేల్చారు. వీటి వెనుక ఉన్నవారిపై కూడా కేసులు నమోదు చేస్తామని చెప్తున్నారు. ప్రభుత్వ అధికారుల, ప్రైవేట్ వైద్యుల హస్తం ఉన్నట్టు ప్రాథమిక విచారణలో అనుమానిస్తున్నారు. ఈనేపథ్యంలోనే ప్రైవేట్ దవాఖానల్లోని వైద్యులు, సిబ్బందిని విచారించేందుకు సీఐడీ బృందాలు రంగంలోకి దిగినట్టు సమాచారం. సమగ్ర దర్యాప్తు తర్వాత.. సూత్రధారులు, పాత్రధారులను అరెస్టు చేయనున్నట్టు సమాచారం. ఈ కేసు దర్యాప్తులోనే పదుల సంఖ్యలోనే అరెస్టులు జరుగుతాయని అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం మోసానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది.

సంవత్సరం కిందటే వెలుగులోకి..

జమ్మికుంట, ఆగస్టు 26: ఏడాది క్రితమే జమ్మికుంటలోని ఒక ప్రైవేట్ దవాఖానలో సీఎంఆర్ఎఫ్, ప్రైవేట్ బీమా సంస్థల దందా సాగినట్టు ఆరోపణలులొచ్చాయి. ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో సంవత్సరం కిందట సీఐడీ డీఎస్పీ శ్రీనివాస్ బృందం రంగంలోకి దిగింది. అధికారులు ప్రైవేట్ దవాఖానలో విచారణ జరిపారు. దవాఖాన ఏర్పాటు, సీఎంఆర్ఎఫ్ కోసం, ప్రైవేట్ బీమా సొమ్ము కాజేసేలా ఇచ్చిన బిల్లులు, తదితర విషయాలపై ఆరా తీశారు. రికార్డులు, బిల్లులు పరిశీలించగా, నకిలీ బిల్లుల బాగోతం బయటపడినట్టు తెలిసింది. కోట్లాది రూపాయల సొమ్ము కాజేసినట్టు అధికారులు గుర్తించనట్లు సమాచారం. అయితే, విచారణ సమయంలో దవాఖాన యాజమాన్యం (వైద్యులు) నకిలీ బిల్లులు తాము ఇచ్చినవి కాదని, దవాఖానలో పనిచేసే కొందరు సిబ్బంది కలిసి మోసానికి పాల్పడ్డారని అధికారులకు వివరించినట్టు తెలిసింది.

అక్రమాలకు పాల్పడిన దవాఖానలు

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో..: అరుణశ్రీ మల్టీ స్పెషాలిటీ (ఐఎస్ సదన్ ఎక్స్ రోడ్), శ్రీకృష్ణ హాస్పిటల్, జనని హాస్పిటల్ (సైదాబాద్), హిరణ్య హాస్పిటల్ (మీర్‌పేట),డెల్టా హాస్పిటల్ (హస్తినాపురం), శ్రీరక్ష (బీఎన్‌రెడ్డి నగర్), ఎంఎంఎస్ హాస్పిటల్ (సాగర్ రింగ్ రోడ్), ఏడీఆర్ఎం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (శారదానగర్), ఎంఎంవీ ఇందిరా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (కొత్తపేట), శ్రీసాయి తిరుమల హాస్పిటల్ (బైరామల్‌గూడ).

ఖమ్మం జిల్లా: శ్రీ శ్రీకర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, డాక్టర్ జేఆర్ ప్రసాద్ హాస్పిటల్, శ్రీవినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీసాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, వైష్ణవి హాస్పిటల్, సుజాత హాస్పిటల్, న్యూ అమృత, ఆరెంజ్ హాస్పిటల్, మేఘశ్రీ హాస్పిటల్

నల్లగొండ జిల్లా: నవీన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (మిర్యాలగూడ), మహేశ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (మిర్యాలగూడ), అమ్మ హాస్పిటల్, (నల్లగొండ)

ఉమ్మడి కరీంనగర్ జిల్లా: సప్తగిరి హాస్పిటల్ (జమ్మికుంట), శ్రీసాయి హాస్పిటల్ (పెద్దపల్లి)

ఉమ్మడి వరంగల్ జిల్లా: రోహిణి మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్ (హనుమకొండ), శ్రీసంజీవిని హాస్పిటల్ (మహబూబాబాద్), సిద్ధార్థ హాస్పిటల్ (మహబూబాబాద్)

రెండు వేల కోట్లిస్తేనే రోడ్ల పునరుద్ధరణ

- 9,400 కి.మీ. మేర పనులకు ప్రతిపాదనలు
- ఇందులో 4,000 కి.మీ. రోడ్లు మరీ అధ్వానం
- నిధులివ్వని రాష్ట్ర సర్కారు

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రోడ్ల పునరుద్ధరణ పనులకు నిధుల సమస్య వెంటాడుతున్నది. సుమారు 9,400 కిలోమీటర్ల మేర రోడ్లను పునరుద్ధరించాల్సి ఉండగా, ఇందులో సగానికి పైగా రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉన్నది. అన్ని రోడ్ల పునరుద్ధరణకు రూ.2,000 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు రూపొందించిన రోడ్లు భవనాల శాఖ, నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన రావడంలేదు. రాష్ట్రంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఆధీనంలోని రోడ్లు మినహా, ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో 24,245 కిలోమీటర్ల మేర రోడ్లు ఉన్నాయి. రోడ్ల నిర్వహణలో భాగంగా ఏటా వర్షాకాలానికి ముందు మరమ్మతులు చేయడం, ప్రతి ఐదేండ్లకోసారి రోడ్లను పూర్తిగా పునరుద్ధరించడం ఆనవాయితీ. ప్రస్తుతం 9,400 కిలోమీటర్ల మేర రోడ్లను పునరుద్ధరించాల్సి ఉన్నది. ఇందులో సుమారు 4,000 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారులు పూర్తిగా ప్రయాణానికి వీలు లేకుండా ఉన్నట్టు గుర్తించారు. రోడ్ల వివరాలు, వాటి పునరుద్ధరణకు రూ.2,000 కోట్లు అవసరమవుతాయనే అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఉలుకూ పలుకు లేదు. నిధులు మంజూరు చేస్తేనే రోడ్లు మెరుగుపడే అవకాశం ఉన్నది.

గురుకుల బదిలీల్లో రిజర్వేషన్లకు తూట్లు

హైదరాబాద్, ఆగస్టు26 (నమస్తే తెలంగాణ): సోషల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీలో నిర్వహించిన బదిలీలు, ప్రమోషన్లలో రిజర్వేషన్లను సైతం అటకెక్కించారు. డిసెండింగ్ ఆర్డర్‌లో ప్రమోషన్లను నిర్వహించి, జనరల్ కోటా పోస్టులను తొలుత భర్తీ చేసి అనంతరం రిజర్వేషన్ కోటాని నింపాల్సి ఉండగా అందుక్కు విరుద్ధంగా ప్రక్రియను చేపట్టారు. గురుకుల డిగ్రీ కాలేజీలకు సంబంధించిన బదిలీలు, పదోన్నతులనైతే అడ్డదిడ్డంగా చేశారని యూనియన్లు ఆరోపిస్తున్నాయి. సొసైటీకి సంబంధించి 2020లో మొత్తంగా 19 డిగ్రీ ప్రిన్సిపాల్ పోస్టులను నోటిఫై చేశారు. అందులో ఓసీ 8, ఎస్సీ 4, ఎస్టీ 2, బీసీ(ఏ) 2, బీసీ(బీ) 1, దివ్యాంగులకు 2 ప్రకటించారు. కానీ ఆ నోటిఫికేషన్‌లో ఓసీ 6, ఎస్సీ 1, బీసీ(ఏ) 1 మొత్తంగా 8 పోస్టులను మాత్రమే భర్తీ చేశారు. 11 డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పోస్టులు మిగిలిపోయాయి. అందులో ఓసీ 2, ఎస్సీ 3, ఎస్టీ 2, బీసీ(ఏ) 1, బీసీ(బీ) 1, దివ్యాంగుల కోటా 2 ఉన్నాయి. ఇవన్నీ కూడా నోటిఫైడ్ పోస్టులు. కానీ సొసైటీ ఉన్నతాధికారులు మాత్రం ఈ నోటిఫైడ్ పోస్టులను సైతం జనరల్ కన్వర్షన్ చేసి నింపారు. ఆ 11 పోస్టులతోపాటు మరో 6 కలిపి మొత్తంగా 17 డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పోస్టులను 100 శాతం ప్రమోషన్ల ద్వారానే, అదీ నిబంధనలకు విరుద్ధంగానే భర్తీ చేసింది. అందులో బీసీ (ఏ), దివ్యాంగుల కోటా లేకుండా చేశారు. సొసైటీలో అర్హులైన మహిళలు లేకుంటే 30% ప్రమోషన్ కోటాలో 50 ఏండ్లు దాటిన పురుష అభ్యర్థులకు ప్రమోషన్ ఇవ్వొచ్చు అన్న నిబంధన ఉన్నది. అయితే, ఒక మహిళా అధ్యాపకురాలు సొంతంగా జాతీయ స్థాయి రిసెర్చ్ ప్రాజెక్టులను పూర్తిచేసినా.. ఆమెను పక్కనబెట్టి డిగ్రీ కాలేజీలో 5 ఏండ్ల బోధన అనుభవం కూడా లేని ఓ పురుష అభ్యర్థికి 30 శాతం కోటా కింద ప్రమోషన్ కల్పించడం గమనార్హం.

కరీంనగర్‌లో ఆర్టీసీ కార్మికుల నిరసన

- కాంగ్రెస్ అనుబంధ ఎస్‌డబ్ల్యూయూ ఆందోళన
- కార్మికులకు న్యాయం జరగడంలేదని ఆవేదన
- పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ బస్టాండ్‌లో నిరసన చేస్తున్న కార్మికులు

కరీంనగర్ తెలంగాణచౌక్, ఆగస్టు 26 : ఆర్టీసీ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఐఎన్‌టీయూసీ ఆర్టీసీ కార్మిక విభాగమైన స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం కరీంనగర్ బస్టాండ్‌లో నిరసనకు దిగారు. అంతకు ముందు యూనియన్ రాష్ట్ర వైస్ చైర్మన్, జిల్లా ఇన్‌చార్జి జక్కుల మల్లేశం ఆధ్వర్యంలో ఆర్ఎం కార్యాలయం ఎదుట నిరసనకు దిగగా.. పోలీసు, సెక్యూరిటీ గార్డులు అనుమతి ఇవ్వలేరు. తమ ప్రభుత్వ పాలనలో శాంతియుత నిరసనను ఎందుకు అడ్డుకుంటురన్నారని వన్ టౌన్ సీఐ సిరిలాల్‌తో వాగ్వాదానికి దిగారు. సమస్యలను ఆర్ఎం దృష్టికి తీసుకెళ్లేందుకు మూడు నెలలుగా ప్రయత్నిస్తున్నా అనుమతి ఇవ్వడంలేదని, అందుకే నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం జక్కుల మల్లేశం మీడియాతో మాట్లాడుతూ.. ఆర్టీసీ అధికారులు కార్మికులను వేధిస్తున్నారని ఆరోపించారు. డ్యూటీ చార్ట్‌లో సంతకం చేయకముందే బ్రీత్ ఎనలైజర్ టెస్టులు చేస్తున్నారని, మద్యం సేవించకపోయినా ఘగర్, బీపీ మందులు వాడినప్పుడు బ్రీత్ ఎనలైజర్ టెస్టులో పర్సంటేజీ చూపెడితే డ్రైవర్లను సస్పెండ్ చేస్తున్నారని వాపోయారు. తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆర్టీసీలో జంగ్ సైరన్

మొదటిపేజీ తరువాయి...

పికెట్‌లో నిర్వహించే కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికుల డిమాండ్లతో కూడిన కరపత్రాలను పంపిణీ చేస్తామని చెప్పారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా నిరసన కార్యక్రమం చేపట్టి సమస్యలను పరిష్కరించుకోనున్నట్టు స్పష్టంచేశారు. 3 వేల కొత్త నియామకాలు చేపడుతామని మూడు మాసాలుగా ఊదరగొడుతున్నా ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని, వెంటనే నియామకాల నోటిఫికేషన్ ప్రకటించాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని ఎస్‌డబ్ల్యూయూ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమిరెల్లి రాజిరెడ్డి, ప్రచార కార్యదర్శి కొవ్వూరు యాదయ్య డిమాండ్ చేశారు.

సమీకృత మార్కెట్లు సగం సగమే!

- నిధులు విడుదల చేయక నిలిచిన పనులు

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో ప్రారంభించిన సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణాలు పడకేశాయి. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణాలకు నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ఇప్పటికే రూ.200 కోట్లు ప్రభుత్వం బకాయి ఉందని, ఆ డబ్బులు ఇచ్చే వరకు పనులు పునః ప్రారంభించమని స్పష్టం చేస్తున్నారు. దీంతో మార్కెట్లు అందుబాటులోకి రాకుండాపోయాయి. ప్రజలకు అవసరమైన పండ్లు, కూరగాయలు, మాసం, చేపలు, పూలు అన్నీ ఒకే దగ్గర లభించాలనే లక్ష్యంతో ప్రతి మున్సిపాలిటీలో ఒక్కొ సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్లను నిర్మించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. వీటి కోసం రూ.500 కోట్లను కేటాయించింది. పట్టణం, నగరం మధ్యలో అన్ని వసతులతో ఉండాలని నిర్ణయించారు. మురుగునీరు నిలిచిపోకుండా మోడల్ డ్రైనేజీ, మరుగుదొడ్లు, మోడల్ లైటింగ్, ప్రహరీ, అంతర్గత రహదారులు, పార్కింగ్ సౌకర్యం, సీసీ కెమెరాలు, మొక్కల పెంపకం, జీరో వేస్ట్ తదితర వాటికి చర్యలు చేపట్టారు. మార్కెట్లు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండే విధంగా రూపకల్పన చేశారు. రాష్ట్రంలో మొత్తం 144 సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్లను మంజూరు చేశారు. 25 వేల కంటే తక్కువ జనాభా ఉన్న 57 పట్టణాల్లో ఒక్కొ దాన్ని రూ.2 కోట్లతో, 25 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న 81 పట్టణాల్లో ఒక్కొక్కటి రూ.4.50 కోట్లతో నిర్మించనున్నారు. లక్ష కంటే ఎక్కువ జనాభా ఉన్న పట్టణాల్లో లక్షకు ఒక మార్కెట్ చొప్పున గరిష్ఠంగా ఐదు నిర్మించాలని నిర్ణయించారు. బీఆర్ఎస్ హయాంలోనే 15 మార్కెట్లు పూర్తి అయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వాటి గురించి పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. కాంట్రాక్టర్లు ప్రభుత్వ అధికారులను ఎన్నిసార్లు కలిసినా పైసా విడుదల చేయలేదు. దీంతో కాంట్రాక్టర్లు అక్కడి యంత్రాలను వేరే పనులకు తరలించారు. తమకు బిల్లులు చెల్లిస్తేనే పనులు ప్రారంభిస్తామని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా నిధులు విడుదల చేసి సమీకృత మార్కెట్లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం సాలార్‌పూర్‌లో మైనింగ్ జరుగుతున్న ప్రాంతం

ఆ'గని' దోపిడీ

- సహజ వనరులనూ వదలని మైనింగ్ లీజుదారులు
- డీజీపీఎస్, ఈటీఎస్ సర్వేతో వెలుగులోకి అక్రమాలు
- రంగారెడ్డి జిల్లాలో 100 వరకు ఖనిజ లీజులు

రంగారెడ్డి/వికారాబాద్, ఆగస్టు 26(నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లాలో మైనింగ్ లీజుదారులు నిబంధనలు అతిక్రమించి యథేచ్ఛగా తవ్వుకుంటున్నారు. సహజ వనరులను కూడా వదలడం లేదు. ప్రభుత్వానికి రాయల్టీ చెల్లింపుల్లోనూ తీవ్ర అవకతవకలు జరుగుతున్నట్టు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం చేపడుతున్న డీజీపీఎస్(డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్, ఈటీఎస్(ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్) సర్వేల్లో పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగుజూస్తున్నాయి. ఏకంగా అటవీశాఖ భూముల్లోనూ అక్రమ మైనింగ్ జరుగుతున్న విషయం బయటపడింది.

ఆదాయమే కాదు.. అక్రమాలూ ఎక్కువే

జిల్లాలో మైనింగ్ ఆదాయం గణనీయంగా ఉంటుండగా అక్రమాలూ అదేస్థాయిలో ఉంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా 152 వరకు క్వార్జ్, గ్రానైట్, కంకర పరిశ్రమలు ఉండగా, ఇందులో 100 మాత్రమే పనిచేస్తున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం లీజు డబ్బులను ఆయా పరిశ్రమల యజమానుల నుంచి గనులు, భూగర్భ శాఖ వసూలు చేస్తున్నది.

ఒకచోట అనుమతి..మరోచోట తవ్వకాలు

జిల్లాలో లీజుదారులు ఒకచోట అనుమతి తీసుకుని మరోచోట తవ్వకాలు సాగించి అక్రమాలకు పాల్పడ్డారు. మరికొందరు అనుమతి పొందిన ప్రాంతం హద్దులు దాటి తవ్వకాలు జరిపారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీలో భారీగా కోతపడింది. దీనికోసమే డీజీపీఎస్, ఈటీఎస్ సర్వే నిర్వహిస్తున్నారు. సర్వేలో వెల్లడైన వివరాల ప్రకారం కొందరు మైనింగ్ యజమానులకు షోకాజ్ నోటీసులు ఇస్తున్నారు. తీవ్రత ఆధారంగా 5 నుంచి 10 రెట్లు పెనాల్టీ వేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 22 మంది లీజుదారులకు డిమాండ్ నోటీసులను జారీ చేసినట్లు మైనింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

అటవీ ప్రాంతంలోనే..

మైనింగ్ శాఖ చేపడుతున్న సర్వేలో కడ్తాల్ మండలం సాలార్‌పూర్ అటవీ ప్రాంతంలోని సర్వే నంబర్ 97లో అక్రమంగా మైనింగ్ చేస్తున్నట్టు నిర్ధారణ అయ్యింది. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు ఎఫ్‌డీవో, రెవెన్యూ, మైనింగ్ శాఖలతో జాయింట్ సర్వే చేయించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. సాలార్‌పూర్‌లో క్వార్ట్జ్, ఫెల్డ్ స్పార్ మైనింగ్‌కు గనుల శాఖ అనుమతులు ఇచ్చింది. అప్పట్లో ల్యాండ్ రెవెన్యూ అధికారులు జరిపిన సర్వేలో అటవీ ప్రాంతానికి వెలుపలే మైనింగ్ ప్రాంతమని నిర్ధారించినట్టు తెలిసింది. ఈ సర్వేలో అటవీశాఖ సైతం పాలుపంచుకుంది. కానీ..తాజాగా చేపట్టిన సర్వేలో మైనింగ్ పనులు జరుగుతున్న ప్రాంతం అటవీ ప్రాంతంలో ఉన్నట్టు తేలింది.

ప్రతిపాదనల్లోనే గౌరారం రిజర్వ్ ఫారెస్ట్

వికారాబాద్ జిల్లా బొంరాసుపేట్ మండలం గౌరారంలోని సర్వే నంబర్ 127లోని 2 వేల ఎకరాల అటవీ భూములను 1971లో రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రతిపాదించారు. తదనంతరం అటవీ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో క్రమంగా తగ్గుతూ 180 ఎకరాలకు చేరింది. మరోవైపు రెవెన్యూ అధికారులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండానే సర్వే నంబర్ 127, 82 రీ అలాట్‌మెంట్ ప్రక్రియ పూర్తి చేశారు. దీంతో ఈ భూములు తమవి కావని అటవీ శాఖ పేర్కొనడంతో, 180 ఎకరాల అటవీ భూములకు పట్టాలిస్తూ వచ్చారు. ఏడాది క్రితం జిల్లా అటవీ శాఖ అధికారిగా డీవీ రెడ్డి పనిచేసిన సమయంలో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. జిల్